# భయం



కె.కె. రఘునందన

గోడ గడియారం ఆరుగంటలు కొట్టేదాకా తలెత్తడానికి కూడా వీల్లేనంత పని ఒత్తిడిలో మునిగిపోయింది శ్రావ్య. ఆయిదు గంటలకే రోజూ వెళ్ళిపోయేది. కాని అతి ముఖ్యమైన ఫైలు స్టడీచేస్తూ వుండిపోయింది.

అసలే శీతాకాలం కావటం వల్ల—అప్పటికే బాగా చీకటి పడిపోయింది.

"అమ్మా! అసలే ఆడపిల్లవి. ఇంకా ఇంటికి వెళ్ళకపోతే మీవాళ్ళు గాభరా పడతారు" అని శ్రావ్యతో చెప్పారు బ్రాంచి మేనేజర్.

టిఫిన్ బాక్సు. వాటర్ బ్యాగ్—పంచిలో సర్దేసి బయలుదేరింది.

అంతదాకా ఆఫీసులో మగ్గిపోయినందువల్ల శ్రావ్యకు విపరీతమైన నీరసంగానూ. తలనొప్పిగానూ ఉంది.

ఇప్పుడింటికి మైలుదూరం నడవాలంటే ఓపికలేదు. రిక్షాలో వెళ్దామంటే రూపాయికి మించి పర్సులో లేదు.

శ్రావ్య యిల్లు దాసిన్నపేటలో ఉంది.

ఆఫీసు మూడులాంతర్లవద్ద వుంది?

ఒకటి- అరా సిటీబస్సులున్నా టైముకు రావు. వాటికోసం ఎదురుచూద్దమంటే చిరాకు ఆమెకు.

పోనీ టీ తాగితే తలనొప్పి తగ్గుతుంది. అప్పుడు నడుచుకుంటూ మెల్లగా ఇంటికి చేరవచ్చు.

అలా అనుకున్నదే తడవుగా దేవీవిలాస్ లోకి దారితీసింది శ్రావ్య.

హోటల్ రద్దీగా ఉంది.

ఓచోట ఖాళీ అయితే వెళ్ళి కూర్చుంది. బేరర్ వచ్చాక టీకి ఆర్డరిచ్చింది.

ఆమె కెదురుగా ఓ నల్లటి మనిషి కూర్చు

న్నాడు.

దుంపలాంటి ముఖం! ముఖంపై పిరిపిరి కాయలతో క్రూరంగా కనిపిస్తున్నాడు.

తననే గమనిస్తున్నాడని గమనించిన శ్రావ్య, చూపులు మరల్చింది. అయితే టీ తాగటం కోసం ముఖం ఎత్తవలసి వస్తుంది.

అప్పుడు స్పష్టంగా ఆ నల్ల తుమ్మమొద్దు కనిపించక తప్పటంలేదు.

అసహ్యంగా అనిపించింది శ్రావ్యకు.

అతని చూపులు తూపుల్లా బాధించ సాగాయామెను.

'రాస్కెల్!' కసిగా అనుకుని గబుక్కున లేచి హోటల్‌లోంచి బయటపడింది. కొద్ది దూరం నడిచిందన్న మాటేకాని ఇందాకా నల్ల వెధవ తనని వెంబడించడు కదాన్న అనుమానమే మనస్సంతా ఆక్రమించింది.

వెనక్కి తిరిగిచూసింది అనుకోకుండానే!

అదిగో దర్టీరోగ్! హోటల్ మెట్లు దిగి తన వెనకే బయలుదేరాడు.

శ్రావ్య ఒళ్ళు భయంతో జలదరించింది.

నడకవేగం హెచ్చించింది.

మళ్ళా వెనక్కి తిరిగి చూసింది.

వాడు మరింత వేగంగా తనని కలుసుకోటానికి ప్రయత్నిస్తున్నాడు.

అయితే ఈరోజు తనని అల్లరిపెట్టడం ఖాయం.

అసలే వీధి లైట్లుండవు.

ఇంటికెళ్ళేదారిలో జనసంచారం కూడా తక్కువగానే ఉంటుంది.

బయట చలిగాలి వీస్తున్నా ఆమె ఒళ్ళంతా చెమటలు పట్టసాగాయి.

వెనక్కి తిరిగి చూస్తే మరింత దగ్గరలో వున్నాడా తుమ్మమొద్దు.

ఎచ్చేడే దెయ్యాలమేడ అనబడే పాడుబడిన భవనం. అక్కడ ఇదివరకే ఎన్నో మాన భంగాలు. దోపిడీలు జరిగాయని వినికిడి.

తన ఒంటరితనం చూసి ఇతను అక్కడ ఏమైనాచేస్తే తనేంచేయగలదు?

జరగబోయే పరిణామాన్ని తలచుకోగానే భయం మరింత ఎక్కువైంది. మరుక్షణం కాళ్లు వణకసాగాయి.

భయంతో గుండె దడ!

మరి వెనక్కి తిరిగిచూసినా చీకటి తప్ప ఏంకనిపించటంలేదు.

"ఏమండోయ్!" పిలుపు.

వెధవ.... వచ్చేసాడు.... తనని కాటేయడానికి.

ఒంటరి ఆడపిల్లల్ని చూస్తే ప్రతి మగ పురుక్కి అలుసే!

"ఆగండీ! మీకోసం పరిగెట్టలేక చస్తున్నాను" అని కేకేశాడు.

గుండెలు దడదడలాడిపోగా శ్రావ్య కాళ్లు మరి ముందుకి పడలేదు.

"ఎందుకండీ ఆ పరుగు! మీకోసం పరిగెట్టుకొస్తుంటే మీరు పరిగెట్టి పారిపోతారేం! ఇందాకా హోటల్లో టీ తాగి, ఈ ఫైలు వది లేసి గాభరాగా వెళ్ళిపోయారు. అదృష్టం కొద్దీ వెంటనే నేను చూసి మీ వెంట బయలుదేరాను మీకది అందిద్దామని. ఇదిగో తీసుకోండి. వస్తా మరి" అని ఫైలు అందించి గబగబ చీకట్లోనే వెళ్ళిపోయాడతను.

తాను గాభరాగా వదిలేసిన అతిముఖ్యమైన ఫైలుని అందించాలనే సదుద్దేశ్యంతో తనవెంట బయలుదేరిన అతన్ని అపార్థం చేసుకొని అనవసరంగా భయపడింది.

చేతిలోని ఫైలుని ఆప్యాయంగా తడుముకుని ఆ మనిషి వెళ్ళినవైపే కృతజ్ఞత నిండిన కళ్ళతో చూస్తూండి పోయిందొక క్షణం శ్రావ్య. ❊

